క్లుప్తంగా...

గుడిసె వాసులను పునరావాస కేంద్రాలకు తరలింపు

జియాగూడ: వర్షాల కారణంగా జంట జలాశయాల నీరు మూసీ నదిలోకి వదలగా ముంపు ప్రమాదాపుటంచున ఉన్న జియాగూడ మూసీ పరీవాహక ప్రాంతాల గుడిసె వాసులను సోమవారం రాత్రి పునరావాస కేంద్రాలకు తరలించినట్లు డిప్యూటీ ఎమ్మార్వో గంగాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ..జియాగూడ మూసీ పరీవాహక ప్రాంతాల్లో దాదాపు 100 వరకు గుడిసెలు వేసుకున్న రాయలసీమ కర్నూల్ ప్రాంతానికి చెందిన వారిని పునరావాస కేంద్రాల్లోకి తరలించడంతో పాటు వారికి పొంగుతున్న మూసీ నది వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు.

ఆదివాసీ కళల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న మామిడి హరికృష్ణ

గన్‌ఫౌండ్రీ: ఆదివాసీ కళలకు ప్రపంచస్థాయి గుర్తింపు రావాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆదివాసీ సకలకళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివాసి కళామహోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలకు గుర్తింపును ఇవ్వడంతో పాటు కళల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కళాకారుల వివిధ నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నటుడు మైమ్ మధు, సింగిడి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు విశ్వకర్మ, సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.శ్రీధర్, ఆదివాసీ నాయకులు వేణు, ఎస్.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత సంగీత నృత్య పోటీల దరఖాస్తు గడువు పొడిగింపు

నాంపల్లి: నవ్య నాటక సమితి నిర్వహణలో జరిగే 48వ అఖిల భారత సంగీత నృత్య పోటీల దరఖాస్తు గడువును పొడిగించినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆగస్టు 1వ తేదీ వరకు సమర్పించవచ్చని తెలిపారు. ఈ పోటీలు ఆగస్టు 26 నుంచి సెప్టెంబరు 2వ తేదీ వరకు బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తులో జరుగుతాయని వివరించారు. ఉత్తర, దక్షిణ భారత శాస్త్రీయ నృత్య రీతులు-హిందుస్తానీ సంగీతం (గాత్రం-సితార్-తబల) కర్ణాటక సంగీతం (గాత్రం-వీణ-వయోలిన్-మృదంగం), కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం, కథక్‌లలో ఈ పోటీలను నిర్వహిస్తామని వివరించారు. వయస్సు ఆధారంగా ఈ పోటీలను సీనియర్లు(17-23 ఏళ్లు), జూనియర్లు(13 నుంచి 16 ఏళ్లు), సబ్ జూనియర్లు (8 నుంచి 12 ఏళ్లు)గా విభజించి పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన సిలబస్, దరఖాస్తు ఫారాలను నారాయణగూడ వైఎంసీఏ కార్యాలయం నుంచి కానీ, నవ్య నాటక సమితి వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని తెలిపారు. వివరాలకు 9908625949, 8919792216లలో సంప్రదించవచ్చు.

పుస్తకాల ఆవిష్కరణ



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ రచయిత పోచంపల్లి సుదర్శన్‌రావు రచనలు నిన్నటి తరానికి నేటి తరానికి వారధిలా నిలుస్తాయని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత చొకాపు వెంకటరమణ అన్నారు. మంగళవారం బాలసాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో సుదర్శన్‌రావు రచించిన సదర్శన శతక చక్రం, సుదర్శన శతక మంజరి, అనగ సహస్రం పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలను రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి టీకే చూడామణి, కార్టూనిస్ట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన యూసుఫియన్ దర్గా



దర్గాలోకి భారీగా చేరిన వరద నీరు

నాంపల్లి: యూసుఫియన్ దర్గాలోనికి వరద నీరు వచ్చి చేరింది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి దర్గా పూర్తిగా నీట మునిగింది. దర్గాలోనికి వర్షం నీరు వచ్చి చేరడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వరద కారణంగా సోమవారం దర్గాలో బస చేసే అవకాశం లేకుండా పోయింది. వక్ఫ్‌బోర్డు ఆధీనంలోకి వచ్చిన యూసుఫియన్ దర్గాను అధికారులు పట్టించుకోకుండా గాలికి వదిలేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు దర్గాకు వచ్చే భక్తులకు అంతరాయం కలుగకుండా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో అలియాబాద్ యూపీహెచ్‌సీ భవనం

- వర్షాలకు గోడల్లోకి నీరు చేరి పెచ్చులూడిన వైనం
- భయాందోళనకు గురవుతున్న వైద్యులు, సిబ్బంది, రోగులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్న వైద్యులు, సిబ్బంది



అలియాబాద్ యూపీహెచ్‌సీ భవనం



పెచ్చులూడిన భవనంలో వివిధ గదులు

గౌలిపురా: ఏకతాటిగా కురుస్తున్న వర్షాలకు అలియాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య (యూపీహెచ్‌సీ) కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పెచ్చులూడి మంగళవారం కొంత మేరకు కూలిపోయింది. 90 ఏళ్లుగా ఈ భవనంలో ఈ యూపీహెచ్‌సీ కేంద్రం కొనసాగుతుంది. దీంతో ప్రతిరోజూ 100-150 మంది ప్రజలు పలు అనారోగ్య సమస్యలతో వస్తుంటారు. కొన్ని రోజులుగా ఈ పురాతన భవనంలోకి వర్షాపు నీరు చేరుకోవడంతో కొద్ది కొద్దిగా పెచ్చులూడుతూ వచ్చింది. ఆస్పత్రి భవనం గోడల ద్వారా వర్షాపు నీరు లోనికి చేరుకొని పూర్తిగా తడిసిపోవడంతో పెచ్చులూడింది. వైద్యాధికారిణి గదిలోకి సైతం వర్షాపు నీరు చేరుకున్నాయి. దీనికి తోడు ఆస్పత్రికి ఉన్న పురాతన గేటు ద్వారా ఆస్పత్రి గోడలకు విద్యుత్ షాక్ (కరెంటు సరఫరా) జరుగుతుండటంతో వైద్యులతో పాటు సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో తమకు ప్రత్యామ్నాయ మార్గాలకు చూపాలని సంబంధిత అధికారులను ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది కోరారు. శిథిలావస్థకు చేరుకున్న ఆస్పత్రి భవనాన్ని గతంలో సంబంధిత అధికారులు పరిశీలించారు. దీంతో ఈ ఆస్పత్రి భవనాన్ని తాత్కాలికంగా అలియాబాద్ గ్రౌండ్‌లో ఉన్న కమిటీ హాల్‌లో మార్చనున్నట్లు సమాచారం.



రంగస్థల ప్రముఖుల స్మారకోపన్యాసం



స్మారకోపన్యాసంలో ఆచార్య కోట్ల హనుమంతరావు, డాక్టర్ పద్మప్రియ

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో రంగస్థల కళల శాఖ పూర్వ శాఖాధిపతులు, కీర్తిశేషులు జేవీ సోమయాజులు, డాక్టర్ మొదలి నాగభూషణ శర్మ, పూర్వ అధ్యాపకులు జే.వీ.రమణమూర్తి స్మారకోపన్యాసం జరిగింది. ఈ కార్యక్రమం లలిత కళాపీఠం పీఠాధిపతి ఆచార్య కోట్ల హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించారు. ప్రసంగకర్తలుగా ఆచార్య జి.ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఎల్వీ భూషణ్ హాజరై వారి గత అనుభవాలను స్మరించుకున్నారు. అతిథిగా రంగస్థల కళల శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పద్మప్రియ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.ఆర్.హరిశ్చంద్ర, వేణుగోపాలాచారి, నాటకరంగ ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు. కళ్యాణి వ్యాఖ్యాతగా, అసిస్టెంట్ ప్రొఫెసర్ మల్లాది గోపాలకృష్ణ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమానికి కో ఆర్డినేటర్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజు ఆంథోనీ వ్యవహరించారు.

ఉస్మానియా ఆస్పత్రిలో ఘనంగా బోనాలు



బోనాల ఉత్సవాల్లో డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ తదితరులు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో ఓజీహెచ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మోతే శోభన్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, అడిషనల్ ఆర్‌ఎంఓ డాక్టర్ త్రివేణి, ఆర్‌ఎంఓలు డాక్టర్ శేషాద్రి, డాక్టర్ ఎండీ రఫీ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్యామ్‌సుందర్, సురేష్, రవిగౌడ్, శివకుమార్, అనిల్‌కుమార్, నర్సింగ్‌రావు, శివ, మోహన్, దేవయ్య, భాస్కర్, రాములు, రాజేష్, నరేందర్ పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు



యాకుత్‌పురా: లోతట్టు ప్రాంతాల్లో సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ తెలిపారు. మంగళవారం నియోజకవర్గంలో పరిధిలోని తలాబ్‌కట్టా, మురాద్‌మహల్, జహంగీర్‌నగర్, అమన్‌నగర్-బీ తదితర ప్రాంతాల్లో ఆయన కార్పొరేటర్ నస్రీన్ సుల్తానా, అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికంగా ఉన్న లోతట్టు ప్రాంతాల్లో తలెత్తున్న వరద నీటి సమస్యలపై స్థానికులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని బస్తీల్లో అధికారులతో కలిసి పర్యటిస్తూ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించమన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న, మజ్లిస్ పార్టీ అమన్‌నగర్-బీ ఏరియా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మొహినుద్దీన్, జలమండలి, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి



విజయ్ శర్మను సన్మానిస్తున్న డాక్టర్ భగవంత్ రావు తదితరులు

అఫ్జల్‌గంజ్: గణేష్ నవరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో వర్షానికి దెబ్బతిన్న రోడ్లను ప్రభుత్వం వెంటనే మరమ్మతులు చేయించాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంత్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సిద్దంబర్‌బజార్ బహేతీ భవన్‌లోని కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా సమితి కో ఆర్డినేటర్‌గా నియమితులైన విజయ్ శర్మను ఘనంగా సన్మానించారు.

గోషామహల్ ఏసీపీకి సన్మానం

అబిడ్స్: గోషామహల్ డివిజన్ నూతన ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. రాష్ట్ర హైకోర్టు న్యాయవాది, లా డిపార్ట్‌మెంట్ రిసెర్చ్ స్కాలర్ పేట సురేష్, సీనియర్ న్యాయవాది అమరేందర్‌రెడ్డి, సంఘ సేవకులు అనంత కమలాకర్‌రెడ్డి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..స్థానిక ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.



ఏసీపీని సత్కరిస్తున్న సురేష్, అమరేందర్ రెడ్డి తదితరులు

తొలగించిన అతిథి అధ్యాపకులను విధుల్లోకి తీసుకోవాలి



ఇంటర్‌బోర్డు ముట్టడికి యత్నించిన బాధిత అతిథి అధ్యాపకులు

నాంపల్లి: ఇంటర్మీడియట్ అతిథి అధ్యాపకులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ నాంపల్లిలోని విద్యాభవన్ ఎదుట బాధిత అతిథి అధ్యాపకులు కదం తొక్కారు. హైకోర్టు ఆదేశాల మేరకు తక్షణమే విధుల్లోకి తీసుకోవాలంటూ ఇంటర్ బోర్డు కార్యాలయ ముట్టడికి యత్నించారు. ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలోనికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించిన బాధిత అతిథి అధ్యాపకులను పోలీసులు అడ్డుకుని నిలువరించారు. దీంతో బాధితులంతా బోర్డు ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తొలగించిన 1654 మంది లెక్చరర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. తొలగించిన అతిథి అధ్యాపకులను కొనసాగించాలని హైకోర్టు ఆదేశాలిచ్చినా బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తొలగించబడిన అతిథి అధ్యాపకులను నిలువరించడం పోలీసులకు కష్టంగా మారడంతో బేగంబజార్ పోలీసులు అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు.

వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



టోలిచౌకి వద్ద పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కొత్తగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన నానల్‌నగర్, టోలిచౌకి, గోల్కొండ, లంగర్‌హౌస్ తదితర డివిజన్లలో పర్యటించారు. కార్వాన్ నియోజకవర్గంలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని ఆయన అన్నారు. తాను గతేడాది ఈ పనులు ప్రారంభమైన రోజే అధికారులు పనులు నిర్ధారిత సమయంలో పూర్తి చేయాలని సూచించడం జరిగిందని, అయితే అధికారులు మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన అన్నారు. నదీమ్ కాలనీలో రోడ్లపై ఇంకా నీరు నిలుస్తుందన్నారు. మరోవైపు టోలిచౌకిలో ఎన్నో షాపులలో వరదనీరు ఇప్పటికీ ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వీటిపై అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదని ఆయన అన్నారు. టోలిచౌకి ఫ్లైఓవర్ కింద జరుగుతున్న డ్రైనేజీ పనులను సత్వరంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను కోరారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

ఘనంగా ప్రపంచ ఐవీఎఫ్ డే



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ హరికాంత్ చారి తదితరులు

గోల్కొండ: సంతానం లేని దంపతులకు మామ్ ఐవీఎఫ్ ఎంతో సురక్షితమైనదని మెహిదీపట్నం మామ్ ఐవీఎఫ్ సెంటర్ సీఈఓ డాక్టర్ హరికాంత అన్నారు. మంగళవారం మామ్ ఐవీఎఫ్‌లో ప్రపంచ ఐవీఎఫ్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మెడికల్ డైరెక్టర్ పూర్ణిమతో కలిసి ప్రపంచ ఐవీఎఫ్ డే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐవీఎఫ్‌పై ఎలాంటి అపోహలు, భయాలు పెట్టుకోవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ సెంటర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణలో భాగంగా భవనాల కూల్చివేత



కూల్చివేతలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజ్‌మోహన్, ఏసీపీ సయ్యద్ అబ్దుల్ ఖాదర్

దూద్‌బౌలి: చందులాల్ బారాదరి నుంచి దూద్‌బౌలి మీదుగా బారాగల్లీ వరకు రోడ్డు విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయని సర్కిల్-9 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సయ్యద్ అబ్దుల్ ఖదీర్ అన్నారు. మంగళవారం రోడ్డు విస్తరణలో భాగంగా సిప్లిగంజ్, దూద్‌బౌలి ప్రాంతాల్లో ఆరు భవనాలను కూల్చివేశారు. అనంతరం పురానాపూల్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్‌తో కలిసి కూలడానికి సిద్ధంగా పురాతన భవనాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ కార్యక్రమం దాదాపు పూర్తి కావచ్చిందని. మిగిలిన భవన యజమానులకు నష్ట పరిహారాన్ని అందజేసి కూల్చివేస్తామని తెలిపారు. టౌన్ ప్లానింగ్ ఎస్‌ఓలు నరేశ్, మునావర్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్‌కు ఉజ్వల భవిష్యత్



అవార్డులను అందజేస్తున్న దృశ్యం

నాంపల్లి: హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుకు నానాటికీ ఆదరణ పెరుగుతోందని నోవాటెల్ జనరల్ మేనేజర్, హెచ్‌ఆర్‌ఏ టీఎస్ హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ ఉపాధ్యక్షుడు రూబిన్ చెరియన్, తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మేంద్ర లంబా తెలిపారు. మంగళవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో రీజెన్సీ కాలేజ్ కలినరీ ఆర్ట్స్ హోటల్ మేనేజ్‌మెంట్ 29వ వార్షిక అవార్డుల ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ.. హోటల్ మేనేజ్‌మెంట్‌కు మంచి భవిష్యత్ ఉందన్నారు. ఈ సందర్భంగా వారు పలువురు ప్రముఖులకు వార్షిక అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజరు సందీప్ జోషి, వెస్ట్ ఇండియా రాడిసన్ హోటల్ గ్రూప్ సౌత్ ఆసియా జనరల్ మేనేజరు రాడిసన్ బ్లూ, లెమన్ ట్రీ హోటల్స్ హైదరాబాద్ జనరల్ మేనేజరు సుకుబీర్ సింగ్, కళాశాల చైర్మన్ హశామ్ ఉల్ కురా, కార్యదర్శి మహ్మద్ ఫతే ఖాలెద్, కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం



మంత్రి తలసానితో సమావేశమైన ఆనంద్‌కుమార్ గౌడ్, ప్రియాగుప్తా

అబిడ్స్: అన్నివర్గాల ప్రజలకు అండగా ఉండి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. ఉస్మాన్‌గంజ్ నాలా వద్ద భారీ వర్షాలకు నాలుగు ఇళ్ల గోడలు కూలిపోవడంతో ఆనంద్‌గౌడ్, ప్రియాగుప్తా మంత్రి తలసానికి బాధితుల సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ...అధికారులు అక్కడ పర్యటించి బాధితులకు తగు న్యాయం చేస్తారని వివరించారు. రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే బాధితులకు తగు సహాయం చేయాలని ఆదేశించారు. ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు మంత్రి తలసాని దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందుకుమార్, ప్రియాగుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'చండాలిక'

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో క్రాంతి కూచిపూడి నాట్యాలయ సంస్థ ఆధ్వర్యంలో మహా కవి పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న రచించిన చండాలిక నృత్య ప్రదర్శనలు మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కిషన్‌రావు మాట్లాడుతూ..నేటి తరానికి బోయి భీమన్న రచనలను పరిచయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, తెలుగు విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ బి.రమేష్, కూచిపూడి నృత్య కళాకారులు డాక్టర్ జి.పద్మజారెడ్డి, వనజారెడ్డి, భీమన్న సాహితీ నిధి ట్రస్ట్ చైర్మన్ హైమావతి భీమన్న, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి పాల్గొన్నారు.



కళాకారులతో ప్రొఫెసర్ కిషన్‌రావు తదితరులు

ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్ యూనియన్



అబిడ్స్: ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా యూనియన్ ఉంటుందని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. ఉద్యోగులకు యూనియన్ చేదోడువాదోడుగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్టేట్ సెంట్రల్ లైబ్రరీకి జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన కేసరి హనుమాన్, ఉపాధ్యక్షులు రాకేష్, ప్రతాప్, కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ అజీజ్, సంయుక్త కార్యదర్శి ఉమా మహేశ్వర్ రెడ్డి, కోశాధికారి సయ్యద్ ఇంతియాజ్‌ఉద్దీన్‌లతో పాటు పలువురు నాయకులు మంగళవారం డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేనిను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమమే తమ ధ్యేయమన్నారు. ధర్మేందర్, రమ్యశ్రీ, శ్రీనివాసరావు, విజయేందర్, కుద్రాడి శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగూడ అమ్మవారికి మారుబోనం

చార్మినార్: ఉప్పుగూడ మహంకాళి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మారు బోనాన్ని సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్‌గౌడ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి మారుబోనాన్ని సమర్పించారు. అనంతరం హిమాయత్‌సాగర్‌లోని సొడమ్మ ఆలయంలో అమ్మవారికి ఒడిబియ్యంతో పాటు మరో బోనాన్ని సమర్పించారు. పాతనగరంలోని పలు దేవాలయాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.



శాతం చెరువు నుంచి నీరు విడుదల

సాక్షి ఎఫెక్ట్..



తూము నుంచి బయటకు వెళ్తున్న నీరు

గోల్కొండ: 'నిండు కుండలా శాతం చెరువు'అన్న శీర్షిక గత సోమవారం సాక్షిలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు శాతం చెరువులో వరదనీరు భారీగా వచ్చి చేరుతుంది. సోమవారం రాత్రి సైతం భారీ వర్షం కురిసింది. కాగా చెరువులో నీరు చేరితే నదీమ్ మరోమారు ముంపునకు గురికావడం ఖాయమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వార్తపై అధికారులు స్పందించారు. ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ సైతం ఈ వార్తను చూసి వెంటనే శాతం చెరువును మంగళవారం ఉదయం సందర్శించారు. శాతం చెరువు తూములో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. అధికారులు శాతం చెరువు తూములో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించారు. తూములో నుంచి భారీగా వరదనీరు బయటకు వెళ్తుంది. 2 రోజుల పాటు తూము ఇలాగే ఉంచితే చెరువులో నీటిమట్టం తగ్గుతుందని అధికారులు అంటున్నారు.

రోబోటిక్స్ పోటీల్లో డాన్ హైస్కూల్‌కు ప్రథమ స్థానం



రోబోటిక్స్ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన డాన్ హై స్కూల్ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు

చార్మినార్: విద్యారంగంలో విశేష సేవలందిస్తున్న అమెరికాకు చెందిన ఎన్జీఓ సీడ్, టావోస్ ఫౌండేషన్ల సంయుక్తాధ్వర్యంలో తొలి ఇంటర్ స్కూల్ రోబోటిక్స్ పోటీలు నిర్వహించారు. పాతబస్తీలోని డాన్ హై స్కూల్ విద్యార్థులు 21వ శతాబ్ది, భవిష్యత్తు సామర్థ్యాలు అనే పోటీల్లో ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. ఈ పోటీలు డాక్టర్ హైదర్ ఖాన్ హాల్‌లో జరిగాయి. నగరానికి చెందిన వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నార్త్ అమెరికాకు చెందిన డెక్కన్ అల్యూమినీ అసోసియేషన్ స్పాన్సర్ చేసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడ్ సంస్థ (అమెరికా) చైర్మన్ సయ్యద్ మజర్ హుస్సేనీ మాట్లాడుతూ.. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న నేపథ్యంలో గతంలో లేని విద్యను కూడా అభ్యసించేందుకు ప్రస్తుతం అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని.. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విద్యలో ముందుకు రావాలన్నారు. డాక్టర్ గులాం అబ్బాస్, ఖైర్-నిసా ఫహీమ్, ఫజ్లుర్ రెహమాన్ ఖుర్రం ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు.

33 పోస్టులు కేటాయించడంపై హర్షం



సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయానికి 33 పోస్టులు అదనంగా మంజూరు చేయడాన్ని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘాలు స్వాగతించాయి. ఈ సందర్భంగా తెలంగాణ టీజీఓ డీఎంహెచ్‌ఎస్ యూనిట్ నాయకులు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ గడాల శ్రీనివాసరావును సన్మానించారు. సంఘం కార్యదర్శి శ్రీహరిరావు కోశాధికారి రాధా అజ్మీర ఉపాధ్యక్షులు శంకర్రావు, నివారణ కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, వివయ్య, నందుపటేల్, కాద్రి గాంధీబాబు పాల్గొన్నారు.

ఆగాపురాలో కూలిన భారీ చెట్టు



అబిడ్స్: భారీ వర్షాలకు ఆగాపురాలో పురాతన చెట్టు రోడ్డుపై కూలిపోయింది. పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. వర్షంలోనే చెట్టు కూలడంతో సకాలంలో ఎవ్వరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న జీహెచ్‌ఎంసీ, విద్యుత్ అధికారులతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకుడు డాక్టర్ మెట్టు శ్రీకాంత్ సహాయక చర్యలు చేపట్టారు.